

కనీస వేతనం అమలు చేయాలి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఒప్పంద కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం అమలు చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. సోమవారం రాత్రి తన చాంబర్‌లో జిల్లా స్థాయి వేతన కమిటీ సమావేశం నిర్వహించారు జూలై 2025 నుంచి జూన్ 2026 వరకూ చెల్లించాల్సిన కనీస వేతనాన్ని కమిటీ నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో అన్‌స్కిల్డ్ ఒప్పంద కార్మికులకు కనీస వేతనం రూ.510 నుంచి 526 వరకూ ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల్లో అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.910 నుంచి రూ.950 వరకూ చెల్లించాలని నిర్ణయించారు.


డాబాతోట వద్ద సందులో బహుళ అంతస్తుల భవనం

కూల్చుతున్నా కడుతున్నారు!

- నగరంలో యథేచ్ఛగా అనధికార నిర్మాణాలు
- నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు
- పక్కాగా అనుమతులు తీసుకోకుండా పనులు
- ఆపై కూల్చివేతలు.. మళ్లీ గుట్టుగా నిర్మాణాలు


అనధికార నిర్మాణాన్ని తొలగిస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది (ఫైల్)

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో అనధికార నిర్మాణాలు, బహుళ అంతస్థుల భవనాలు పెరుగుతున్నాయి. వాటిని గుర్తించి కూలుస్తున్నా ఇతర చోట్ల మళ్లీ వెలుస్తూనే ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా.. అనుమతులు తీసుకోకుండా కొందరు వ్యక్తులు భారీ భవనాలు నిర్మిస్తున్నారు. వారికి నేతల అండ ఉన్నట్లు తెలుస్తోంది. నగరంలోని తోటపాలెం వద్ద ఓ వ్యక్తి ప్రైవేటు వసతిగృహం కోసం బహుళ అంతస్తుల భవనం నిర్మించాడు. నిబంధనలు అతిక్రమించి మెట్లను, లిఫ్ట్‌ను ఏర్పాటు చేశాడు. దీనిని టౌన్ ప్లానింగు అధికారులు గుర్తించి తొలగించారు. ఆ తర్వాత కొద్దిరోజులు ఆగిన భవన యాజమాని పునఃనిర్మాణం చేపట్టాడు. పద్మావతినగర్‌లోని ఓ గ్రూప్ హౌస్ నిర్మాణంలో కూడా నిబంధనలు పాటించకపోవడంతో ప్లానింగ్ సిబ్బంది కొంత కట్టడాన్ని తొలగించారు. మళ్లీ కొద్ది రోజుల్లోనే ఆయన మరో ఫ్లోర్ నిర్మాణం చేపట్టాడు.

- తోటపాలెం ఐనాక్స్ థియేటర్ వద్ద ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అనుమతుల్లేకుండా అదనపు భవనం నిర్మించడంతో టౌన్ ప్లానింగు సిబ్బంది వాటిని కూల్చివేశారు. కొద్ది రోజుల్లో మళ్లీ నిర్మాణం చేపట్టడం గమనార్హం.

పర్యవేక్షణ లేక

నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగు (మిగతా 8వ పేజీలో..)

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం

అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం. క్షేత్రస్థాయిలో పరిశీలించి తొలగిస్తున్నాం. అదనపు భవనాల నిర్మాణానికి నగరపాలకసంస్థ ప్రణాళికా విభాగం అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలి. నిబంధనలు అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- పి.నల్లనయ్య, కమిషనర్, నగరపాలక సంస్థ


ఎలుగుబంటి వారి వీధిలో ఓ భవన నిర్మాణం

- జిల్లాలో తగ్గిన సుఖ ప్రసవాలు
- 74 శాతం సిజేరియన్లే
- కొంతమంది కాసుల కక్కుర్తి
- శస్త్రచికిత్సల్లో జిల్లాకు ఐదో స్థానం
- పిల్లల భవిష్యత్‌పై ప్రభావం పడుతుందంటున్న నిపుణులు



కాన్పుకొస్తే కోతే!



- విజయనగరానికి చెందిన మరో గర్భిణి స్థానికంగానే ఓ ప్రైవేటు వైద్యురాలి దగ్గర సేవలు పొందుతోంది. ఎనిమిది నెలల పాటు ఆమె వద్ద వైద్య పరీక్షలు చేయించుకుంది. తొమ్మిదో నెల వచ్చాక బిడ్డకు ఆక్సిజన్ సరిగా అందడం లేదని, ఆపరేషన్ చేయాలని చెప్పింది. చేసేది లేక ఆమె ఆపరేషన్ చేయించుకుంది. ఐదు రోజులు ఆస్పత్రిలో ఉంచి రూ.1.5లక్షల బిల్లు వేశారు.

- విజయనగరానికి చెందిన ఓ గర్భిణి ప్రారంభం నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటోంది. అన్నీ సవ్యంగా ఉన్నాయని సుఖ ప్రసవం ఖాయమని వైద్యులు చెప్పారు. తీరా నెలలు నిండే సమయానికి కడుపులో బిడ్డ ఉమ్మనీరు తాగిందని.. అత్యవసరంగా వైద్యం అందించాలని చెప్పుకొచ్చారు. దీంతో ఆపరేషన్ చేసి ప్రసవం చేయించగా ఐదు రోజుల పాటు ఉంచి రూ.లక్ష బిల్లు వసూలు చేశారు.

విజయనగరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసలు ఏ ఆస్పత్రిలో కూడా సుఖ ప్రసవం అన్న మాటేలేదు. అన్నింటికీ ఆపరేషన్లే మందు అన్నట్టు పరిస్థితి మారింది. ఒకప్పుడు అత్యవసర పరిస్థితుల్లో తల్లీబిడ్డలను కాపాడేందుకు మాత్రమే సిజేరియన్లు చేసేవారు. ఇప్పుడు కాన్పు అంటేనే కోత అన్నట్టుగా మారిపోయింది. వివిధ కారణాలు చెప్పి ఆపరేషన్లకు ఒప్పిస్తున్నారు. దండిగా ఆదాయం సమకూర్చుకుంటున్నారు. సాధారణ ప్రసవానికి రూ.30 వేలు, శస్త్రచికిత్స అయితే రూ.50 వేల నుంచి రూ.70 వేలు వసూలు చేస్తున్నారు. మందులతో పాటు గదుల అద్దెలు అదనం. జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస స్థాయిలో కూడా ప్రసవాలు జరగడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రం లెక్కలేనన్ని జరుగుతున్నాయి. దేశంలో అత్యధిక శస్త్రచికిత్సలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఏపీ మూడోస్థానంలో ఉంది. అదే రాష్ట్రంలో విజయనగరం జిల్లా ఐదో స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 85 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఆరోగ్య సహాయకులు, ఆశాలు, 108, 104 సిబ్బంది సైతం ఉన్నారు. కానీ సుఖప్రసవాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. దీనిపై ప్రజల్లో అవగాహన లేకపోవడం ప్రధాన కారణం. అవగాహన పెంచాల్సిన యంత్రాంగం తమ పని కాదన్నట్టు వ్యవహరిస్తోంది. గత ఏడాది విజయనగరం జిల్లాలోని 30 మండలాల్లో ప్రభుత్వాస్పత్రుల్లో జరిగిన సుఖ ప్రసవాలు కేవలం 776 మాత్రమే. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వాస్పత్రుల్లో 20,272 ప్రసవాలు జరిగాయి. అందులో 14,424 సాధారణ ప్రసవాలు కాగా.. శస్త్రచికిత్సల ద్వారా (మిగతా 8వ పేజీలో..)

తల్లీ బిడ్డకు ప్రమాదం

వీలైనంత వరకూ సుఖ ప్రసవాలు చేయాలి. తల్లీబిడ్డ ఆరోగ్యానికి ఇబ్బందని తెలిస్తేనే ఆపరేషన్లు చేయాలి. ముందస్తు ప్రసవం అనేది తల్లీబిడ్డల అనారోగ్యానికి ఒక హేతువు. ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప.. ముందస్తుగా ముహూర్తాలు పెట్టుకుని ప్రసవాలు చేయించడం నేరంగా పరిగణిస్తారు. వీలైనంత వరకూ సుఖ ప్రసవాల కోసం ఎదురుచూడాలి. ఈ విషయంలో ప్రజల్లో అవగాహన పెరగాలి.

- డాక్టర్ జీవనరాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, విజయనగరం

మేధస్సుకు పరీక్ష

- విద్యార్థులకు జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష
- శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేలా కేంద్రం ప్రోత్సాహం
- ఆరో తరగతి నుంచి చిట్టి శాస్త్రవేత్తల తయారీకి సిద్ధం
- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' దరఖాస్తుకు అవకాశం
- ఆరో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు..
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబరు 30వరకు గడువు
- ప్రతిభ చూపితే జాతీయ పరిశోధనసంస్థల్లో ఇంటర్న్‌షిప్

6లో

బాలికల విద్యకు భరోసా

6లో

- రూ.20 కోట్లతో డార్మెటరీలు
- అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు
- కేజీబీవీల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు



అర్హత ఉన్నవారికే అవార్డులకు సిఫారసు

- పనితీరులో ప్రతిభ చూపేవారినే గుర్తించాలి
- లోపాలు జరిగితే జిల్లా అధికారులపై చర్యలు
- కలెక్టర్ అంబేడ్కర్

6లో





కందిపప్పు ఇచ్చేదెప్పుడో!

- ఈ నెలలోనూ లబ్ధిదారులకు నిరాశే
- నాలుగు నెలలుగా పేదంటికి దూరం



గజపతినగరం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులకు కందిపప్పు అందడం లేదు. ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఒక్కో నెల మినహాయిస్తూ ఇచ్చారు. నాలుగు నెలలుగా పూర్తిగా పంపిణీ చేయడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో కందిపప్పును క్రమం తప్పకుండా సరఫరా చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నెలా ఇస్తారని అంతా ఆశించారు. కానీ అప్పుడప్పుడే ఇస్తూ వచ్చారు. ఏప్రిల్ నుంచి పూర్తిగా ఇవ్వడం లేదు. కేవలం బియ్యం, అరకిలో పంచదార మాత్రమే అందజేస్తున్నారు.

జిల్లాలో 5లక్షల71వేల802 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. ప్రతినెలా లబ్ధిదారులకు కిలో కందిపప్పు చొప్పున పంపిణీ చేయాలంటే 571.80 టన్నులు సరఫరా చేయాల్సి ఉంటుంది. అమరావతిలో కందిపప్పు టెండర్‌లు ఖరారు కాకపోవడంతోనే సరఫరా నిలిచిపోయిందని సంబంధిత అధికారులు అంటున్నారు. సాధారణంగా రేషన్ దుకాణాల్లో కిలో కందిపప్పు రూ.67కే లబ్ధిదారులకు పంపిణీ చేస్తుండేవారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120నుంచి రూ.140 వరకు ధర పలుకుతోంది. దీంతో సామాన్య ప్రజలు బయట కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. రేషన్ దుకాణాల్లో సరఫరా లేకపోవడంతో (మిగతా 8వ పేజీలో..)

ఖైదీలతో మాట్లాడేందుకు కోర్టుల్లో ఆండ్రాయిడ్ టీవీలు

6లో


గంట్యాడ: చిరిగిన విద్యార్థినుల బ్యాగులు

ఆ బ్యాగులతో అవస్థలే

- ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- నాణ్యత లేనివి సరఫరా
- 45 రోజులకే చిరిగిపోయిన వైనం

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కింద అందించిన బ్యాగుల్లో నాణ్యత లోపించింది. పంపిణీ చేసిన 45 రోజులకే బ్యాగ్‌లు చిరిగిపోతున్నాయి. దీంతో కొందరు టైలర్‌తో కుట్టుకుని వినియోగించుకోగా మరికొంతమంది పక్కన పెట్టి వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేసుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర ద్వారా యూనిఫాం, షూలు, బ్యాగ్, నోట్ పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్, బెల్ట్‌లు తదితర కిట్లను గత జూన్ నెలలో పాఠశాల పునఃప్రారంభించిన వెంటనే పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో ఒకటి నుంచి పదో తరగతి చదివే 1,17,054 మంది విద్యార్థులకు బ్యాగులను అందించారు. మిగిలిన వాటిని పక్కన పెడితే బ్యాగులు మాత్రం నాణ్యత లేవనేది విద్యార్థుల మాట. వాటిలో దాదాపు 12 కేజీల బరువు పెట్టుకోవచ్చు. అయితే అంతకన్నా తక్కువ బరువు పుస్తకాలు ఉంచినా చిరిగిపోతున్నాయని అంటున్నారు. చిన్న క్లాసులకు ఇచ్చిన బ్యాగులు కూడా తొందరగా చిరిగిపోతున్నాయని చెబుతున్నారు. జిప్‌లు వేసే చోట క్లాత్ పీచు పీచుగా వదిలేస్తున్నాయి. మరికొన్ని తాళ్లు తెగిపోవడం, ఇంకొన్ని కుట్లు వదిలేయడం జరుగుతోంది. బయట మార్కెట్‌లో కొనలేని పేదలు చిరిగిపోయినా సర్దుకుపోతున్నారు. ఏడాది పాటు ఉండాల్సిన బ్యాగులు (మిగతా 8వ పేజీలో..)


ఇతర బ్యాగులను వినియోగిస్తున్న విద్యార్థులు

పైశాచికం

- 8 ఏళ్ల బాలిక ముందు వికృత చేష్టలు
- భయపడిన చిన్నారి
- నిందితుడికి దేహశుద్ధి చేసిన స్థానికులు

భోగాపురం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల బాలిక ముందు వికృత చేష్టలు ప్రదర్శించిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన భోగాపురం మండలం గుడివాడలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

భోగాపురం మండలం ఓ గ్రామంలో విజయనగరం కంటోన్మెంట్‌కు చెందిన బూర్ల విజయ్‌కుమార్(39) మరో మహిళతో కలిసి ట్యూషన్ చెబుతున్నాడు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆ గ్రామంలో ట్యూషన్ నిర్వహిస్తున్నాడు. విజయ్‌కుమార్ ఓ పేరొందిన కార్పొరేట్ స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఆ గ్రామంలో 60 మంది పిల్లలకు ట్యూషన్ చెబుతున్నాడు. ఈనెల 2న ట్యూషన్‌కు మహిళ రాలేదు. విజయ్‌కుమార్ ఒక్కడే ఉండగా 3వ తరగతి చదువుతున్న 8 ఏళ్ల బాలికను పక్క గదిలోకి పిలిచాడు. అనంతరం ఆ చిన్నారి ముందు (మిగతా 8వ పేజీలో..)


పోలీసుల అదుపులో బూర్ల విజయ్‌కుమార్

స్నేహితులతో సరదాగా గడిపేందుకు వచ్చి..

- ఊబిలో చిక్కుకుని యువకుడి మృతి

7

ఆటోలో వచ్చి.. ప్రయాణికులను మభ్యపెట్టి

- బంగారం చోరీ
- పోలీసులకు చిక్కిన బ్యాచ్

7

ఈ సెల్‌ఫోన్లు మాకొద్దు

7

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

మేధస్సుకు పరీక్ష



- విద్యార్థులకు జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష
- శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేలా కేంద్రం ప్రోత్సాహం
- ఆరో తరగతి నుంచి చిట్టి శాస్త్రవేత్తల తయారీకి సిద్ధం
- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' దరఖాస్తుకు అవకాశం
- ఆరో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు..
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబరు 30వరకు గడువు
- ప్రతిభ చూపితే జాతీయ పరిశోధనసంస్థల్లో ఇంటర్న్‌షిప్

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. వారిలో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నాయి. పాఠశాలస్థాయి నుంచి పరిశోధనల్లో రాణించేలా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్రప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పరీక్షను ఎన్‌సీఈఆర్టీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఆరోతరగతి నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న వారు ఈ పరీక్ష రాయొచ్చు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు దేశ ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్, ఉపకారవేతనాలు పొందే అవకాశం ఉంటుంది.

సెప్టెంబరు 30 వరకు రిజిస్ట్రేషన్

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈఏడాది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. సెప్టెంబరు 30 వరకు గడువు ఉంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాల్లో ఏదైనా ఒకదాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన దరఖాస్తును ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలి. ఇలా ఇంటి నుంచే పరీక్ష రాసే అవకాశం ఉంది.

వంద మార్కులకు పరీక్ష

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. లెవెల్-1 ప్రధాన పరీక్షలో ఆయా తరగతులకు సంబంధించిన వంద ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున వంద మార్కులు కేటాయిస్తారు. సెక్షన్-ఎలో విజ్ఞాన్‌శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషిపై 20 ప్రశ్నలు, సత్యేంద్ర నాథ్‌బోస్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్- బిలో 6 నుంచి 11 తరగతులకు సంబంధించి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు, లాజిక్, రీజనింగ్‌కు సంబంధించి 10ప్రశ్నలు ఉంటాయి. మొదటి విభాగంలో ఉత్తీర్ణులైన వారికి లెవెల్-2 పరీక్షల్లో 50 ప్రశ్నలు వంద మార్కులకు ఉంటాయి.

రాష్ట్రస్థాయికి ఎంపిక చేసేదిలా..

పాఠశాల స్థాయిలో ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 25 మందిని ఎంపిక చేస్తారు. 6 నుంచి 11 తరగతులకుగాను మొత్తం 150 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. ఇందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయి పరీక్ష డిసెంబరు 21, 28 తేదీల్లోగానీ జనవరి 4న గానీ ఏదో ఒక రోజు రాయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలతోపాటు మెమెంటో, సర్టిఫికెట్‌ను అందజేస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమెంటో, ప్రశంసాపత్రం ఇస్తారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక ఇలా..

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యారుల వంతున 12 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతీ తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల చొప్పున 18 మందిని జాతీయస్థాయి విజేతులుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రతమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలు తోపాటు మెమెంటో, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. నెలకు రూ. 2వేల చొప్పున సంవత్సరంపాటు భాస్కర ఉపకార వేతనం కింద రూ.24వేలు అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2025-26లో జాతీయ, జోనల్‌స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్సీ తదితర ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో ఒకటి నుంచి మూడు వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తారు.

దరఖాస్తు ఇలా చేసుకోవచ్చు

విద్యార్థులు వ్యక్తిగతంగా, అలాగే పాఠశాల నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. పరీక్ష రాసేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ. వివిఎం.ఓఆర్‌జి.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. విద్యార్థుల వివరాలను నమోదు చేసిన తరువాత రూ.200 ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ దరఖాస్తును పూర్తి చేయాలి.

మేధాశక్తిని బయటకు తీసేందుకే..



విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని బయటకు తీసేందుకు ఇది చాలా ఉపయోపడుతుంది. సైన్సుపై అభిరుచిని పెంపొందిండంతో పాటు వారిని శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది.

- టి.రాజేష్, జిల్లా సైన్సు అధికారి, విజయనగరం

రెండు విభాగాల్లో పరీక్ష..

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు విడివిడిగా ఉంటాయి. హిందీ, ఇంగ్లీషు భాషలతో ప్రాంతీయ భాషల్లోనూ పరీక్ష రాసేందుకు వెసులుబాటు ఉంది. మన విద్యార్థులు తెలుగు లేదా ఆంగ్లంలో రాయవచ్చు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షకు సంబంధించి సెప్టెంబరు 1 నుంచి మాక్ పరీక్షలు నిర్వహిస్తారు. పాఠశాల స్థాయిలో ప్రధాన పరీక్ష అక్టోబరు 28 నుంచి 30 వరకు జరుగుతుంది. ఈస్థాయిలో ఉత్తీర్ణులైన వారికి లెవెల్-2 ద్వితీయ పరీక్షను ఆన్‌లైన్‌లో ప్రోక్టరింగ్ విధానంలో పరిశీలకుల సమక్షంలో నవంబరు 19న జరుపుతారు. ఆయా పరీక్షలను ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటలు మధ్య 90 నిమిషాల వ్యవధిలో రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి యాప్‌లో ఒక్కసారి మాత్రమే లాగిన్ అవుతారు.



అవగాహన పెంచేందుకు చర్యలు



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన పెంచడానికి చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా భావితరానికి శాస్త్రవేత్తలను తయారు చేసేందుకు ఇది వేదికగా నిలుస్తుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇక నుంచి సైన్సు పరిజ్ఞానం పెంచే విధంగా అవగాహన కల్పిస్తాం. దేశంలో పేరున్న ఇస్రో, డీఆర్‌డీవో, సీఎస్ఆర్ఐ వంటి సంస్థల్లో ఇంటర్న్ షిప్ చేసే అవకాశం కలుగుతుంది.

- ఆకులు భానుప్రకాష్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఫోరం నాయకులు

అర్హత ఉన్నవారికే అవార్డులకు సిఫారసు

- పనితీరులో ప్రతిభ ఉన్నవారినే గుర్తించాలి
- లోపాలు జరిగితే జిల్లా అధికారులపై చర్యలు
- కలెక్టరు అంబేడ్కర్



వినతులు పరిశీలిస్తున్న కలెక్టరు అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్ ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పనితీరులో ప్రతిభ ఉన్నవారినే గుర్తించి స్వాతంత్ర దినోత్సవం అవార్డులకు సిఫారసు చేయాలని కలెక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఎవరిపడితే వారిని సిపార్సు చేసిన తర్వాత.. వీరిపై పత్రికల్లో వార్తలు వస్తే విచారించి జిల్లా అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పీజీఆర్ఎస్ వినతులు స్వీకరణలో భాగంగా జిల్లా అధికారులుతో సమీక్షించారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి ప్రభుత్వశాఖల్లో పనిచేసిన వారికి అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. ఈ ఆరు నెలల్లో ఎవరు ఉత్తమ ప్రతిభ కనబరిచారు? ప్రభుత్వ పథకాలను ఎలా ముందుకు తీసుకెళ్లారు? అన్న అంశాలు పరిగణనలోకి తీసుకుని అవార్డులకు సిపార్సు చేయాలన్నారు. ఈ నెల 15న జరగనున్న స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగరవేస్తారని, , పోలీసు గ్రౌండ్‌లో తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. స్టాల్స్ ఏర్పాట్లు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలోని జేసీ సేతు మాధవన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అలసత్వం చేయొద్దు

ప్రజల అర్జీలను గడువులోగా పరిష్కరించడంలో కొందరు జిల్లా అధికారులు అలసత్వం వహిస్తున్నారని కలెక్టరు అన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం ఆయన వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 198 వినతులు వచ్చాయి. వీటిలో రెవెన్యూశాఖ 736, డీఆర్‌డీఏ 51, విద్యాశాఖ 12, మున్సిపల్ 10, జిల్లా పంచాయతీ 8, విద్యుత్‌శాఖ 7, ఇతరశాఖలకు సంబంధించి 37 వచ్చాయి. కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో దాట్ల కీర్తి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, ప్రమీలాగాంధీ తదితరులు పాల్గొన్నారు.

లారీకి ఇనుప చక్రాలు

- రైల్వే పట్టాలపై రయ్ రయ్

బొబ్బిలి/రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టాలపై రైళ్ల పరుగులు పెడుతుండడం చూస్తుంటాం. కానీ పట్టాలపై లారీ చూశారా? బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో ఇలాంటి దృశ్యమే కనిపించింది. రైల్వేట్రాక్‌పై ఒక లారీ (అదికూడా స్టేషన్ ప్లాట్‌ఫారంలో) పరుగులు పెట్టడం ఆశ్చర్యం కలిగించింది. 4వ నెంబరు ప్లాట్‌ఫారంపై రైల్వేట్రాక్ నిర్మాణ పనులలో భాగంగా సామగ్రిని తరలించేందుకు దీన్ని ఉపయోగిస్తున్నారు. ఇటీవల రైల్వేస్టేషన్ల విస్తరణలో భాగంగా ట్రాక్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. పట్టాలపై సామగ్రిని తరలించాలంటే రహదారిపై నడిచే వాహనాలకు సాధ్యం కాదు. అందుకే టైర్లకు బదులుగా రైలుబోగీలకు ఉండే ఇనుప చక్రాలను లారీకి అమర్చి.. సులువుగా సామగ్రిని ఇలా తరలిస్తున్నారు.



బొబ్బిలి రైల్వే స్టేషన్‌లో రైల్వేట్రాక్‌పై పరుగులు పెడుతున్న లారీ/ట్రక్ దృశ్యం

బాధితుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలి

- ఎస్పీ వకుల్ జిందాల్



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 32 ఫిర్యాదులు స్వీకరించారు. తీసుకున్న ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించి 15, కుటుంబ కలహాలకు సంబంధించి 2, మోసాలకు పాల్పడినట్టు 1, ఇతర అంశాలకు సంబంధించి 14 ఫిర్యాదులు ఉన్నాయి. సంబంధిత ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాస్తవమైనట్టయితే, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఏడు రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు ఎవీ లీలారావు, సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తప్లాన్ వద్దు.. పాతప్లాన్ ముద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): డెంకాడ మండలం గుణుపూరుపేట రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసప వ్యక్తం చేశారు. వీఎంఆర్‌డీ మాస్టర్ ప్లాన్ 2041 ప్రకారం తమ గ్రామంలో కొండరాజు చెరువు కింద ఆయకట్టు రైతులు భూములు కోల్పోతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పాత మాస్టర్ ప్లాన్‌కు రైతులు నుంచి ఎలాంటి వ్యతిరేకత లేదని, కొంతమంది రియల్ ఎస్టేటు వ్యాపారుల కోసం గత ప్రభుత్వం హయంలో ఈ ప్లాన్ మార్చడం జరిగిందని ఆవేదణ వ్యక్తం చేశారు. ఈ మాస్టర్ ప్లాన్‌కు గ్రామ రైతులంతా వ్యతిరేకంగా ఉన్నారని ఆరోపించారు. దీని వల్ల గ్రామంలోని ఒక్క సెంటు వ్యవసాయ భూమి మిగలదని ఆరోపించారు. పాత ప్లాన్ ప్రకారం వీఎంఆర్‌డీ మాస్టర్ ప్లాన్ ఉండాలని, లేని పక్షంలో రైతులు ఆత్మహత్యలే శరణ్యమని కలెక్టరేట్ ఎదుట వాపోయారు. ఈ నిరసన కార్యక్రమంలోని రైతులు ఉన్నారు.

పవర్‌ప్లాంట్ నిర్మాణం ఆపాలి

దత్తిరాజేరు మండలం ఇంగిలాపల్లి గ్రామంలో ఎస్‌టి కాలనీకి ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలం పవర్ ప్లాంట్ నిర్మాణంకు ప్రతిపాదనలు జరుగుతున్నాయంటూ గ్రామానికి చెందిన కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం సమర్పించారు.

బాలికల విద్యకు భరోసా



- రూ.20 కోట్లతో డార్మెటరీలు
- అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు
- కేజీబీవీల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు

రాజాం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బాలికల విద్య కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీలను వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. జూనియర్ కాలేజీ స్థాయి వాటిని అప్‌గ్రేడ్ చేసినా వసతులను మాత్రం పట్టించుకోలేదు. నాడు-నేడులో భాగంగా నిధులు కేటాయించిన బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. తాజాగా వాటిని పూర్తిచేసే బాధ్యత తీసుకుంది కూటమి ప్రభుత్వం. కేజీబీవీల్లో డార్మెటరీలతో పాటు అదనపు భవనాల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయిస్తోంది. జిల్లాలో ఉన్న 12 కేజీబీవీల్లో డార్మెటరీలు, అదనపు భవనాల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేసింది. అలాగే వైసీపీ హయాంలో నాడు-నేడులో భాగంగా పెండింగ్‌లో ఉన్న 270 అదనపు గదుల నిర్మాణం కూడా పూర్తిచేయనుంది. ఇందుకు సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో మిగతా కేజీబీవీల్లో అదనపు గదులతో పాటు డార్మెటరీలు ఏర్పాటు చేయనున్నారు.

వసతి సమస్య లేకుండా..

జిల్లాలో 22 కేజీబీవీ విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే తొలిదశలో 12 కేజీబీవీల్లో అదనపు గదులు, డార్మెటరీల నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేయించి విద్యార్థినులకు వసతి సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు. జిల్లాలోని అన్ని కేజీబీవీలు కాలేజీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ఒక్కో తరగతిలో సగటున 40 సీట్ల వరకూ ఉంటాయి. అయితే దాదాపు అన్ని కేజీబీవీలో అడ్మిషన్లు జరిగాయి. అయితే కాలేజీగా అప్‌గ్రేడ్ కాగా.. విద్యార్థులకు తగినంతగా వసతి లేకపోవడంతో ఇరుకు గదుల్లో కొనసాగాల్సి వస్తోంది. వైసీపీ హయాంలో అదనపు గదుల నిర్మాణం పూర్తిచేయలేక పోయారు. అందుకే కూటమి ప్రభుత్వం ఇపేడు ప్రత్యేకంగా దృష్టిసారించింది.

ఆరేసి డార్మెటరీ గదులతో..

ప్రస్తుతం జిల్లాలో 12 కేజీబీవీ విద్యాలయాలకు రూ.1.60 కోట్లు వెచ్చించనున్నారు. ప్రతి విద్యాలయంలో 6 డార్మెటరీ గదులు, రెండేసి మరుగుదొడ్ల బ్లాక్‌లు నిర్మించనున్నారు. ప్రధానంగా ఇక్కడ విద్యార్థినులు ఉండడంతో వారికి వసతి సమస్య లేకుండా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. నాడు-నేడులో భాగంగా పెండింగ్‌లో ఉండిపోయిన అదనపు గదుల నిర్మాణాలను ప్రభుత్వం పూర్తిచేయనుంది. ఇతర మౌలిక సదుపాయాలు కూడా కల్పించనుంది. రూ.18.5 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, రూ.23.10 లక్షలతో గ్రంథాలయం, రూ.18.5 లక్షలతో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ గది నిర్మించనుంది. చిన్నచిన్న మరమ్మతులు కూడా చేయించనుంది. బాలికలు ఉండడంతో వారికి రక్షణగా ప్రహరీలు నిర్మించనుంది.

ప్రత్యేకంగా దృష్టి

జిల్లాలో కేజీబీవీల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న అదనపు గదుల నిర్మాణాన్ని పూర్తిచేస్తాం. 12 కేజీబీవీల్లో డార్మెటరీల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరైంది. వీలైనంత త్వరగా వాటి నిర్మాణాలు పూర్తిచేస్తాం. ప్రతి విద్యాలయంలో కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు గ్రంథాలయం అందుబాటులోకి తెస్తాం. వచ్చే విద్యాసంవత్సరం నాటికి అన్ని పాఠశాలలకు రక్షణ గోడల నిర్మాణం కూడా పూర్తిచేస్తాం.

- ఎ.రామరావు, సమగ్రశిక్ష ఏసీపీ, విజయనగరం

ఖైదీలతో మాట్లాడేందుకు కోర్టుల్లో టీవీలు



కొత్తవలస కోర్టులో ఏర్పాటు చేసిన టీవీ

కొత్తవలస, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇకపై జైలులో ఉన్న ఖైదీలతో నేరుగా న్యాయాధికారులు మాట్లాడేందుకు కోర్టులలో ఆండ్రాయిడ్ టీవీలను ఏర్పాటు చేస్తున్నారు. కొత్తవలస కోర్టులో కూడా న్యాయాధికారి కుర్చీ సమీపంలోనే ఆండ్రాయిడ్ టీవీని ఏర్పాటు చేశారు. జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నవారి కేసులకు సంబంధించి నేరుగా కోర్టుకు తీసుకుని రావడం వీలు కానప్పుడు న్యాయాధికారులు నేరుగా ఖైదీలతో మాట్లాడే అవకాశం ఉంది. జుడిషియల్ కస్టడీలో ఉన్న ఖైదీలకు ప్రతి 14రోజులకు ఒకసారి కస్టడీ పొడిగించాల్సి ఉంటుంది. అటువంటి సమయంలో పోలీసులు పని వత్తిడి కారణంగా మరే ఇతర కారణాల వల్ల గానీ కోర్టుకు నేరుగా తీసుకుని రాలేని సమయంలో జైళ్లలో కోర్టుకు ఉన్న అనుసంధానం ద్వారా ఖైదీలకు సంబంధించి కస్టడీని పొడిగించేందుకు వీలుంటుంది. రానున్న కాలంలో కోర్టులలో జరుగుతున్న విచారణలను నేరుగా పార్టీలు చూసేందుకు, కోర్టులలో తమ న్యాయవాదులు ఏవిధంగా వాదనలు చేస్తున్నారో నేరుగా తెలుసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని న్యాయవాదులు తెలిపారు.

శిశుమరణాలను నియంత్రించండి: జేసీ

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాలు నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. మరణం తరువాత చేసేది ఏమి ఉండదని, సాధ్యమైనంత వరకూ చిత్తశుద్ధితో కృషిచేసి, ఆధునిక వైద్య సదుపాయాలు, తమ అనుభవం, వైద్య పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రాణాలు కాపాడాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎంపీసీడీఎస్ఆర్ సమావేశం నిర్వహించారు. ఈ మూడు నెలల్లో ఇద్దరు బాలింతలు, ముగ్గురు శిశువులు మృతి చెందినట్టు అధికారులు వివరించారు. బాలింతలు మృతిపై వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా మరోసారి విచారణ చేసి నివేధికలను అందజేయాలని ఆదేశించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య సూచించారు. ఆయన ఆదేశాలతో సచివాలయ పరిధిలోని ఏఎన్ఎంలు, కార్యదర్శులు సోమవారం ఇంటింటి ఫీవర్ సర్వే చేశారు. అవసరమైన వారికి పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఈనేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు ఎంతో అవసరమన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలు లేకుండా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రై డేని పాటించాలని ఆయన సూచించారు.

కూటమి ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతాం



మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సురేష్

గజపతినగరం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): పార్టీలో చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకుంటూ కూటమి ప్రభుత్వంతో ముందుకు సాగుతామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రాపు సురేష్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో ఇటీవల చిన్నచిన్న మనస్పర్థలతో పలువురు నాయకులు డైరక్టర్ పదవులకు రాజీనామా చేసినట్లు ప్రకటించారని, వాటిని వెనక్కు తీసుకున్నామని ఆయన తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సారథ్యంలో నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కలిగిపండు, ఏఎంసీ డైరక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

చీపురుపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు చీపురుపల్లి ప్రభుత్వ ఆదర్శ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. విజయనగరం విజ్జి స్టేడియంలో ఈనెల 3న జరిగిన ఎంపిక పోటీల్లో ఈ కళాశాలకు చెందిన టి.దేవిక లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానం, హై జంప్‌లో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. అదేవిధంగా కె.స్వాతి లాంగ్ జంప్‌లో రెండో స్థానం పొందింది. ఈ మేరకు వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు బాపట్ల జిల్లా చీరాలలో ఈనెల 9 నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డా.వీవీ కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్, పీడీ వి.రామలక్ష్మి, డా.జ్వాలాముఖి అభినందించారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

రాజాం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రథమ చికిత్సపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాజాం సబ్ బ్రాంచ్ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక జీఎంఆర్ ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ జోనల్ క్యాంప్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స, సీపీఆర్‌లపై శిక్షణ ఇచ్చారు. ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గొలివి రమణ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్, జిల్లా ఫీల్డ్ అధికారి మన్మథరావు, నంది ఉమాశంకర్, ఎన్‌సీసీ కల్నల్ శశాంక్ కుష్వా తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎస్.కోట రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి గురుకుల కళాశాలలో జువాలజీ సబ్జెక్ట్ బోధించేందుకు తాత్కాలిక పద్ధతిలో నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శారదబాయ్ తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సబ్జెక్టులో 50శాతం మార్కులు సాధించిన మహిళలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8712625071ను సంప్రదించాలని కోరారు.

ఎరువుల పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సంతకవిటి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పంట విస్తీర్ణం, పంట దశ ప్రకారం వ్యవసాయ శాస్త్రవేత్తల సిఫారసు ప్రాప్తికి యూరియా, డీఏపీ అందిస్తున్నామని సంతకవిటి పీఏసీఎస్ అధ్యక్షుడు చెలికాని మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం బొద్దూరు గ్రామ రైతు సేవా కేంద్రంలో రాజాం వాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లూరు గణేష్ ఆధ్వర్యంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల సేవలను రైతులు వినియోగించుకోవాలన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

● వాహన మిత్ర కింద రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్



గజపతినగరం: నిరసన చేస్తున్న ఆటో డ్రైవర్లు



విజయనగరం కలెక్టరేట్ వద్ద..

గజపతినగరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక నీళ్లట్యాంకు వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో మోటార్ వాహనాల ఫిట్‌నెస్, ఎఫ్‌సీలు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వాహనమిత్ర పథకం కింద నెలకు రూ.15వేలు తక్షణమే చెల్లించాలని కోరారు. అలాగే ప్రమాదాల నివారణ పేరుతో ఏడేళ్ల జైలుశిక్ష, రూ.10లక్షల జరిమానా యాక్టు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ, రమణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● విజయనగరం కలెక్టరేట్: మహిళలకు ఫ్రీ బస్సు అమలు చేస్తే తమ జీవనోపాధి దెబ్బతింటుందని ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద వారు నిరసన చేపట్టారు. ఈ సంఘ నాయకులు మాట్లాడుతూ తమను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుని ఆర్టీసీలో గానీ, ఇతర సంస్థల్లో గానీ ఉద్యోగాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. వాహన మిత్ర కింద రూ.15వేలు తగ్గకుండా అందజేయాలని కోరారు. సంఘ నాయకులు రెడ్డి నారాయణరావు, అప్పలరాజు రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

టారీఫ్ బోర్డులను ఏర్పాటు చేయాలి

● డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్, క్లీనిక్స్ ల్యాబ్స్ స్కానింగు కేంద్రాలు తప్పనిసరిగా టారీఫ్ బోర్డులు(ధరల పట్టిక) పెట్టాలని.. ధరల వివరాలు పూర్తిగా అందరికీ కనబడే విధంగా ప్రదర్శించాలని డీఎంహెచ్‌వో డా.ఎస్.జీవనరాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసీపీ, ఎన్‌టీటీ చట్టం 1994ను అనుసరించి స్కానింగ్ రూం లోపల, బయట 'లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం' అనే బోర్డులను ఇంగ్లీషు, తెలుగులో ప్రదర్శించాలని సూచించారు. అలాగే ప్రతి ఆసుపత్రిలో ఎన్‌వోసీ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎవరైనా ఈ నిబంధనలను అతిక్రమిస్తే, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

గాయాలపాలైన అనాథను ఆసుపత్రిలో చేర్చారు

రాజాం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయపడిన ఓ అనాథ మహిళను మానవతా సంస్థ వారు ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. బొబ్బిలి రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో ఒక మూలన గాయాలతో పడి ఉన్న మహిళను స్థానికులు గుర్తించి మానవతా సంస్థకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ సంస్థవారు ఆమెను ప్రత్యేక వాహనంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేర్పించి, ప్రథమ చికిత్స చేయించారు. ఆమెకు శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. ఆమెను ఆసుపత్రికి చేర్పినవారిలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్య కుమార్, మానవత సంస్థ కార్యదర్శి నీలకంఠేశ్వర యాదవ్, ఏయూ బ్యాంకు ప్రతినిధి కిరణ్ ఉన్నారు.

మూడు ఉద్యోగాలకు ఎంపిక



మేఘన

సంతకవిటి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరినాయుడుపేట గ్రామానికి చెందిన వావిలపల్లి మేఘన మూడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై అబ్బురపరిచింది. ఈమె ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ పూర్తి చేసింది. మూడేళ్లగా పట్టుదలతో పోటీ పరీక్షలకు పోటీపడుతూ వస్తోంది. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, నావల్ డాక్‌యార్డ్, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ తపాలా శాఖ అధికారిగా ఉద్యోగాలు సాధించింది. సోమవారం చెన్నైలో పోస్టల్ సెక్రటేరియట్ కార్యాలయంలో పోస్టల్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరినట్టు తండ్రి చిన్నంనాయుడు తెలిపారు. ఈసందర్భంగా మేఘనను తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సోమవారం విజయనగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. రహదారికి ఆనుకుని పొదలు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతుందో.. గమనించారు. నిర్ణీత సమయానికి సిబ్బంది విధులకు హాజరవుతున్నారో.. లేదో అడిగి తెలుసుకున్నారు. తడి చెత్త, పొడిచెత్త సేకరణ ఆశాజనకంగా ఉన్నప్పటికీ, శతశాతం చెత్త సేకరణ జరిగే విధంగా మరింత కృషి చేయాలన్నారు. అనంతరం అన్నా క్యాంటీన్‌ను సందర్శించారు.

హామీల అమలుకు ప్రాధాన్యం

● ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



కరపత్రం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం హామీల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నగరంలోని 17, 18, 19, 21 డివిజన్ల పరిధిలో ఆమె పర్యటించారు. ఏడాది పాలనలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం పుచ్చలవీధి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. హామీలు ఇచ్చి, అమలు చేసిన ప్రస్తుత ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే గొల్లలపాలెంలో కూడా పర్యటించారు.

రిక్షా కాలనీలో జ్వరాలు

చీపురుపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పట్టణంలోని రిక్షా కాలనీలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. మండలంలోని విశ్వనాథపురంలో రెండు రోజుల కిందట విష జ్వరంతో జాస్మిన్ అనే ఐదేళ్ల బాలిక మృతి చెందింది. ఈ నేపథ్యంలో రిక్షా కాలనీలో జ్వరాలు ప్రబలడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, రెండు రోజుల కిందట ఈ కాలనీలో వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది పలు పరీక్షలు నిర్వహించినప్పటికీ, జ్వరాలు ప్రబలడానికి తగిన కారణాలు తెలియరాలేదు. అయితే పైప్‌లైన్ లీక్ అవడంతో తాగునీరు కలుషితమయ్యిందని, దాని కారణంగానే జ్వరాలు ప్రబలినట్టు వైద్య ఆరోగ్య సిబ్బంది చెబుతునప్పటికీ, స్థానికులు మాత్రం వారి వివరణను కొట్టి పారేస్తున్నారు. కర్లాం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని వైద్యాధికారులు చెబుతున్నారు.

మైనింగ్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న మైనింగ్ కార్మికులు

గరివిడి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాడ, గుర్ల మండలంలోని సదానందపురం గ్రామాల్లో గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న మైనింగ్ కార్మికులు సోమవారం గరివిడి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ సదానందపురం, దేవాడ గ్రామాల్లో ఉన్న మైనింగ్ లీజుల కాల పరిమితి ముగిసినందున కార్మికులను విధుల నుంచి తొలగిస్తామని మైనింగ్ యాజమాన్యం సమాచారం ఇస్తోందని తెలిపారు. ఈ రెండు మైనింగ్‌ల కాల పరిమితిని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ బంగార్రాజుకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు టీవీ రమణ, జె.విశ్వనాథరాజు, ఎ.గౌరి నాయుడు, ఎస్.పాపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసను కరువు మండలంగా ప్రకటించాలి

కొత్తవలస, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కొత్తవలసను కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి డేగల అప్పలరాజు సోమవారం స్థానిక తహసీల్దార్ అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు. కొత్తవలస మండలమే కాదని జిల్లాలో అనేక మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, వాటిని కూడా కరువు మండలాలుగా ప్రకటించాలని కలెక్టర్‌ను కోరనున్నట్టు తెలిపారు. ఒక గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని కరువు నిర్ధారణ చేయాలని కోరారు. ఉపాధి పనులను 200 రోజులు చేసి పని కల్పించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని తహసీల్దార్ తెలిపారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

డెంకాడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5వేలు, పీఎం కిసాన్ కింద రూ.2వేలు జమ కావడం ఖాయమని మండల వ్యవసాయ అధికారిణి సంగీత తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. అన్నదాత సుఖీభవ అందని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ-క్రాప్ నమోదు కోసం ఆధార్, బ్యాంకు అకౌంట్ జిరాక్సులతో సంప్రదించాలని కోరారు. అలాగే ఎకరాకు రూ.200 చొప్పున చెల్లించి పంటల బీమా చేసుకోవాలన్నారు. మండలంలో రైతు సేవా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఏఈవో రామకోటి తదితరులు పాల్గొన్నారు.

చెప్పులతో కొట్టుకుంటూ..

● జిందాల్ నిర్వాసితుల నిరసన



చెప్పులతో కొట్టుకుని నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామంలో గత 43 రోజులుగా ఆందోళన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు మంగళవారం వినూత్నంగా నిరసన చేపట్టారు. చెప్పులతో కొట్టుకుని నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా నేత చల్లా జగన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ సోమేశ్వరరావు మాట్లాడుతూ నిర్వాసితులకు కలెక్టర్, ప్రజాప్రతినిధులు న్యాయం చేయాలని కోరారు. ఈ భూముల్లో ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటుచేసి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

ముర్రుపాలే మొదటి టీకా

● ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



బొండపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో ఉమాభారతి

బొండపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లులు తమ శిశువుకు మొదటిగా అందించిన ముర్రుపాలు మొదటి టీకాగా పనిచేస్తాయని సీడీపీవో ఉమాభారతి అన్నారు. దేవుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని, మాట్లాడారు. తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రామతులసి, ఏఎన్ఎం సెక్టార్ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ● కొత్తవలస: తల్లిపాలలో ఎన్నో విటమిన్లు, ఖనిజ లవణాలు ఉంటాయని వియ్యంపేట ఐసీడీఎస్ పీవో ఆర్.ఉమాదేవి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం వియ్యంపేటలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె.. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ● నెల్లిమర్ల: తల్లిపాలు శిశుకు అమృతం వంటివని ఐసీడీఎస్ నెల్లిమర్ల ప్రాజెక్టు సూపర్‌వైజర్ త్రినాథ అన్నారు. సోమవారం ఆమె జరజాపుపేటలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ నల్లి కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ● గుర్ల: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమైనవి గరివిడి ఐసీడీఎస్ పీవో ఆరుద్ర అన్నారు. పాలవలస గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీవో తోపాటు సూపర్‌వైజర్ శకుంతల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సెల్‌ఫోన్లు మాకొద్దు

● జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

● యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్

ప్రభుత్వం తమకు ఇచ్చిన సెల్‌ఫోన్లు సరిగ్గా పనిచేయడం లేదు.. ఇవి తమకు వద్దని జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పోషణ్ ట్రాకర్, బాలసంజీవిని తదితర యాప్‌ల నిర్వహణకు సెల్‌ఫోన్లు సపోర్ట్ చేయడం లేదు.. దీంతో సమయానుకూలంగా విధులు నిర్వహించలేకపోతున్నాం.. అధికారుల నుంచి ఒత్తిడికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. ఈసందర్భంగా వారంతా తమ సెల్‌ఫోన్లను సంబంధిత ఐసీడీఎస్ కార్యాలయాలకు తీసుకొచ్చి, సిబ్బందికి అప్పగించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, విజయనగరం



రాజాం: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



ఎస్.కోట: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద..



చీపురుపల్లిలో..



గజపతినగరం: సెల్‌ఫోన్లను అధికారులకు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

స్నేహితులతో సరదాగా గడిపేందుకు వచ్చి..

● ఊబిలో చిక్కుకుని యువకుడి మృతి



లక్ష్మణరెడ్డి (ఫైల్)

జామి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవం రోజున తన స్నేహి తులతో కలిసి సరదాగా గడిపేందుకు మండలంలోని జాగరం వాటర్‌ఫాల్స్‌కు వచ్చిన ఓ యువకుడు ఊబిలో చిక్కుకుని మృతిచెందాడు. ఈ ఘటనపై ఎస్ఐ వీరజనార్ధన్ మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం బొడ్డుపాలెం గ్రామానికి చెందిన సాడి లక్ష్మణరెడ్డి(32) సోమవారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మిత్రులతో కలిసి జామి మండలంలోని జాగరం వాటర్‌పాల్స్‌కు వచ్చాడు. స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొడుతూ గడిపాడు. అయితే సాయంత్రం ఆరుగంటల సమయంలో బహిర్భూమికి వెళ్లి పక్కన ఉన్న నీటితో శుభ్రం చేసుకునే సమయంలో కాలుజారి ఊబిలో పడిపోయాడు. ఇది గమనించిన స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ జాడ కానరాలేదు. అయితే మంగళవారం ఉదయం మరోసారి వెతికే ప్రయత్నం చేయగా మృతదేహం కనిపించింది. స్నేహితులతో సరదాగా గడపడానికి వెళ్లిన తన భర్త చనిపోవడంతో భార్య అరుణ రోదన చూపరులను కంటతడి పెట్టించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడు విశాఖలోని రామాటాకీస్ ఏరియాలో ఉన్న ఎక్సెల్ వరల్డ్‌లో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడని స్నేహితులు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



ఈశ్వరరావు (ఫైల్)

భోగాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్య పాల్పడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై భోగాపురం ఎస్ఐ పాపారావు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రావాడ గ్రామానికి చెందిన బుగత గోవిందమ్మ, ఈశ్వరరావు(47)లు భార్యా భర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు లావణ్య, అరుణకుమార్ ఉన్నారు. అయితే ఇటీవల తల్లికి వందనం పథకంలో భాగంగా గోవిందమ్మ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయ్యింది. అలాగే అన్నదాత సుఖీభవ కింద ఈశ్వరరావుకు నగదు జమ అయ్యింది. ఈశ్వరరావు నిత్యం మద్యం తాగుతూ ఉంటాడు. అయితే పిల్లల స్కూల్ ఫీజు కట్టేందుకు డబ్బులు చాలవని గోవిందమ్మ.. తన భర్త ఈశ్వరరావును అన్నదాత సుఖీభవ డబ్బులు అడిగింది. దీనికి ఈశ్వరరావు 'నా దగ్గర డబ్బులు లేవు.. నీదగ్గర ఉన్న డబ్బులు నాకు కావాలి' అని భార్యని అడిగాడు. అలాగే ఇద్దరు పిల్లలు కూడా స్కూల్ ఫీజుకు డబ్బులు కావాలని ఈశ్వరరావును అడిగారు. దీంతో గట్టిగా కేకలు వేస్తూ ఈనెల 2వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించడం ప్రారంభించారు. రావాడ సమీప లేఅవుట్‌లో వాంతులు చేసుకుంటూ ఉన్న ఈశ్వరరావు స్థానికులకు కనిపించాడు. పక్కనే గడ్డి మందు ఖాళీ డబ్బా ఉంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని హుటాహుటిన తగరపువలస ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 3వ తేదీ ఆదివారం రాత్రి మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్రంగా రోధించారు. గోవిందమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోలో వచ్చి.. ప్రయాణికులను మభ్యపెట్టి

● బంగారం చోరీ ● పోలీసులకు చిక్కిన బ్యాచ్

సాలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆటోపై వచ్చి ప్రయాణికులను మభ్యపెట్టి వారి వద్ద బంగారం ఎత్తుకుపోయే ఓ బ్యాచ్‌ను పట్టణ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పట్టణ ఎస్ఐ అనీల్‌కుమార్ కథనం మేరకు.. మెంటాడ మండలంలోని పిట్టాడ గ్రామానికి చెందిన గొర్లె రమణి, పాల లక్ష్మి, పాల వేణు, పాల శిరీష ప్రస్తుతం గొట్లాం వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆదివారం వీరు నలుగురూ తమ సొంత ఆటోపై సాలూరు వచ్చారు. పాచిపెంట మండలంలోని పి.కోనవలస గ్రామానికి చెందిన గుణాపు సుజాత ఆమె అత్త అప్పలనరసమ్మలు సాలూరు ఏరియా ఆసుపత్రి నుంచి వస్తున్నారు. ఆటో పి.కొనవలస వెళ్తుందని చెప్పడంతో సుజాత, అప్పలనరసమ్మ ఎక్కారు. ఇంతలో పండ్లు కొందామని సుజాత ఆటో ఆపి దిగింది. దీంతో వెంటనే అప్పలనరసమ్మ మెడలో ఉన్న బంగారం గొలుసు లాక్కొన్నారు. కొంత దూరం వెళ్లిన తర్వాత ఆమెను దించేసి ఆటోపై ఆ నలుగురు వెళ్లిపోయారు. దీంతో సుజాత పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. పట్టణ సీఐ అప్పలనాయుడు మూడు బృందాలను ఏర్పాటుచేసి గాలింపు చర్యలు చేపట్టారు. సాలూరు బైపాస్ రోడ్డులో నెలిపర్తి సమీపం వద్ద సోమవారం ఆటోలో వెళ్తున్న నలుగురిని గుర్తించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బంగారం గొలుసును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గతంలో అనేక కేసులు నమోదయ్యాయి. కాగా కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్టు

శృంగవరపుకోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న ఓ వ్యక్తిని ఎస్.కోట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ వి.నారాయణమూర్తి అందించిన వివరాల ప్రకారం.. గత ఏడాది డిసెంబరు నెలలో 117 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన వాహనాన్ని, ఇద్దరు వ్యక్తులను అప్పట్లో అదుపులోకి తీసుకున్నారు. అయితే అక్కడ నుంచి వాహనాన్ని పంపించి.. గంజాయి తీసుకు రమ్మన్న వ్యక్తి మాత్రం తప్పించుకు తిరుగుతున్నాడు. పట్టుబడిన నిందితులు చెప్పిన వివరాల ప్రకారం కేరళ పోలీసులు ఆ రాష్ట్రంలోని త్రిస్సూర్ జిల్లా కట్టూరు పట్టణం జనశక్తి రోడ్డు, మందపల్లి వీధికి చెందిన శ్రీజిత్‌ను అక్కడ కోర్టులో ప్రవేశపెట్టారు. ఆ కోర్టు ఆదేశాల ప్రకారం ఎస్.కోటకు తీసుకువచ్చారు. స్థానిక కోర్టులో ప్రవేశపెట్టారు. కేంద్ర కారాగారానికి పంపించారు. గంజాయి కేసులో అరెస్టు కాకుండా తప్పించుకుని ఏ రాష్ట్రంలో తిరిగినా అరెస్టు చేసి తీరుతామని సీఐ తెలిపారు.

మళ్లీ రెచ్చిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ చోరులు

జామి ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది నెలల కిందట రైతుల పంట పొలాల్లో ఉన్న సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌పార్మర్లు ఎత్తుకెళ్లి.. ఇటు విద్యుత్‌శాఖకు అటు రైతులకు తీవ్ర నష్టం కలిగించిన విద్యుత్‌చోరులు మరోసారి రెచ్చిపోయారు. ఈసారి మండలంలోని అన్నంరాజుపేట, అట్టాడ గ్రామాల్లో ఉన్న రైతుల పొలాల్లో 3ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లతో ఉన్న రాగివైరును దొంగిలించారు. ఈ విషయంపై ఏఈ తేజేశ్వరరావు మంగళవారం మాట్లాడుతూ మండలంలోని రెండు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ జరిగాయని, వీటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

చెరువులో ఆక్రమణలు తొలగించండి

శృంగవరపుకోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పోతనాపల్లి గ్రామంలోని రాయివాని(రైవాడు) చెరువులో ఆక్రమణలు తొలగించాలని ఆ గ్రామ రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. చెరువును ఆక్రమించడంతో సాగుభూముల్లోకి వెళ్లేందుకు దారి ఉండడం లేదన్నారు.

ఈ మట్టి రోడ్డును బాగుచేయరూ..

● అధ్వానంగా మజ్జిరామునిపేట-ఆమదాలవలస రోడ్డు

● అవస్థలు పడుతున్న వాహనచోదకులు



మజ్జిరామునిపేట నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డు

రేగిడి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మజ్జిరామునిపేట క్వారీ నుంచి ఆమదాలవలస గ్రామానికి వెళ్లే రెండు కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు పూర్తిగా పాడయ్యింది. దీంతో వాహనచోదకులు, రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ రోడ్డు నుంచి ఆమదాలవలస, మండల కేంద్రానికి వెళ్లేందుకు అత్యంత దగ్గర కావటంతో రెండు దశాబ్దాల కిందట అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డును గ్రావెల్ రోడ్డుగా తీర్చిదిద్దారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఈ రోడ్డును పూర్తిగా విస్మరించాయి. కనీస మరమ్మతులు కానీ, నిర్వహణ చర్యలు గానీ చేపట్టలేదు. దీంతో ఈ రోడ్డు అత్యంత దారుణంగా తయారయ్యింది. ఈ రూట్లో ఉన్న మజ్జిరా మునిపేట, ఆమదాలవలస వ్యవసాయ పంటల రవాణాకు ఈ రోడ్డే ప్రధాన ఆధారం. వర్షాలు పడితే వెళ్ల లేని దుస్థితిలో ఉంది. వాహన చోదకులు, బాటసా రులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డును ఎన్ఆర్‌జీఎస్‌లో భాగం గా బాగుచేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

కూల్చుతున్నా కడుతున్నారు!

(ఐదో పేజీ తరువాయి)

విభాగంలో ఇద్దరు అసిస్టెంట్ సిటీప్లానర్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టరు, ఆయా సచివాలయాల పరిధిలో ప్రణాళిక కార్యదర్శులు నగరంలో అనధికార నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. కాని ఈ పర్యవేక్షణ కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు లేదా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు మాత్రమే ఒక తంతుగా జరుగుతోంది. కొత్తగా నిర్మాణాలు ప్రారంభించినప్పుడు నిబంధనలకు విరుద్ధంగా వుంటే ప్రారంభ దశలోనే వాటిని గుర్తించి ఆపాల్సిన యంత్రాంగం నిర్మాణాలు పూర్తయ్యే వరకూ కిమ్మనడం లేదు. ఒకసారి అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు వస్తే దానిని కూల్చివేయడానికి నగరపాలక సంస్థ భారీగా ఖర్చుచేయాల్సి వస్తుంది. కూల్చివేత కోసం ఎక్సకవేటర్లు, కార్మికులు, పోలీసు భద్రతకు వేలరూపాయలు వెచ్చిస్తున్నారు. కానీ కూల్చివేత జరిగిన కొన్నిరోజులకే అదే స్థలంలో మళ్లీ నిర్మాణాలను మొదలుపెడుతున్నారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వ ధనం వృథా అవుతోంది తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకడం లేదు.

చర్యలు కరువు

అక్రమ నిర్మాణాన్ని కూల్చిన తరువాత మళ్లీ పనులు చేపట్టే యాజమానులపై ఎటువంటి చర్యలు ఇంతవరకూ తీసుకున్న దాఖలాలు లేవు. ముందుగా తీసుకున్న ప్లాన్‌లో సెల్లార్‌లను పార్కింగ్ కోసం చూపించి ఆ తరువాత అక్కడ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. సెల్లార్‌లను షాపులుగా, గొడౌన్లుగా మార్చుతున్నారు. ఫలితంగా ఆయా చోట్ల పార్కింగ్‌కు స్థలం లేక రహదారిమీదే వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

● కాలువలు, రహదారులు ఆక్రమించి బఫర్ జోన్ నిబంధనలను కూడా అతిక్రమిస్తున్నారు.

● రెసిడెన్షియల్ నిర్మాణాలకు అనుమతులు తీసుకుని కమర్షియల్ అవసరాల కోసం నిర్మాణాలు చేపడుతున్నారు. తద్వారా నగరపాలక సంస్థ ఆదాయానికి గండికొడుతున్నారు.

● కొందరు వ్యక్తులు నేతల సహకారంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

● అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించకుండా సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మించిన భవనాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఫైర్ అదుపు చేసే వాహనాలు లోపలికి చేరుకోవడం కష్టం. దీనివల్ల భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశాలు ఎక్కువ.

● డ్రైనేజీ సదుపాయం లేకుండా నిర్మాణం చేపట్టడం వల్ల మురుగునీటి సమస్య తలెత్తుతోంది.

● కంటోన్మెంట్, గాయిత్రీనగర్, కాలిఘాట్ కాలనీ, దాసన్నపేట, ఫూల్‌బాగ్, తోటపాలెం, రింగురోడ్డు ఏరియా, డాబాతోట, కేఎల్‌పురం తదితరప్రాంతాల్లో అనుమతులు లేని కట్టడాలు కోకొల్లలుగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో 15 అడుగుల స్థలం కూడా లేని సందులో భవనాలు నిర్మించడం కొసమెరుపు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాల విషయంలో శాశ్వత చర్యలు చేపట్టాలి.

కాన్పుకొస్తే కోతే!

(ఐదో పేజీ తరువాయి)

5,848 జరిగాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో 20,501 జరగగా..11,999 సాధారణ, 8,502 శస్త్రచికిత్సల ద్వారా ప్రసవాలు జరిగాయి. అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మూఢ నమ్మకాలతోనూ..

జాతకాలు, ఇతర నమ్మకాలతో కొందరు ముందస్తు ప్రసవాల వైపు మొగ్గుచూపుతున్నారు. సుఖ ప్రసవం కోసం ఎదురుచూడడం లేదు. ఫలానా రోజు మంచిది అంటూ ముహూర్తాలు నిర్ణయిస్తున్నారు. ఆగస్టు 15, జనవరి 1 వంటి పర్వదినాల నాడు ప్రసవాలు చేయించిన వారూ ఉన్నారు. పెద్దల పేరిట సెంటిమెంట్ అని ఒకరు.. చనిపోయిన పూర్వీకుల పుట్టిన రోజు అని మరొకరు.. ఇలా ప్రతిఒక్కరూ ముందస్తు ప్రసవాలకే మొగ్గుచూపుతున్నారు. అటు కాసుల కక్కుర్తిపడిన వైద్యులు సైతం ప్రసవాలు కోసం వెళుతున్న వారి మైండ్‌లో ఏవేవో ఆలోచనలు చొప్పిస్తున్నారు. దీంతో కుటుంబసభ్యులు సైతం సుఖ ప్రసవాలు అన్న విషయాన్నే మరిచిపోతున్నారు. సాధారణంగా ఆస్పత్రులకు వెళుతుంటే 'రక్తం తగ్గిందని, బిడ్డ ఉమ్మనీరు తాగేసిందని, బరువు ఎక్కువగా ఉందని, రక్తపోటు అధికమైందని, బిడ్డ అడ్డం తిరికిందని' ఇలా రకరకాల కారణాలు చెబుతూ అమ్మ కడుపు కోసేస్తున్నారు. లక్షల రూపాయల పేరిట ఫీజులు వసూలు చేస్తున్నారు. బాధితుల్లో ఎక్కువగా పేదలు, సామాన్యులు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పేరుకే ప్రభుత్వాస్పత్రుల్లో సుఖ ప్రసవాలని చెప్పుకొస్తున్నారు. దీనిని ప్రచార ఆర్భాటం చేసేశారు.

ఎదుగుదల లేకుండా..

శిశువు శరీరంలో అన్ని అవయవాలు పూర్తిస్థాయిలో వృద్ధి చెందేందుకు 39 వారాల సమయం పడుతుంది. అప్పుడే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తుంది. కాగా కొద్ది రోజులు ముందుగానే ప్రసవాలు చేస్తుండడంతో వారి ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. శస్త్రచికిత్స ద్వారా ప్రసవించిన శిశువు బరువు తక్కువగా ఉంటోంది. ఊపిరితిత్తులు సరిగా ఎదగడం లేదని, శ్వాస సంబంధిత సమస్యలు వస్తున్నాయంటున్నారు. పచ్చకామెర్లతో పాటు ఇతరత్రా ఇన్‌ఫెక్షన్లు సైతం సోకుతున్నాయి. ఆ తర్వాత జీవితాంతం రకరకాల అనారోగ్య సమస్యలు వెంటాడే ప్రమాదం ఉంది.

ఇష్టారాజ్యంగా కత్తిగాట్లు..

జిల్లాలో 74 శాతం సిజేరియన్లు జరగటం ఆందోళన కలిగిస్తోంది. గర్భిణీకి శస్త్రచికిత్స చేస్తే అందుకు గల కారణాలను రిపోర్టులో స్పష్టంగా రాయాలి కానీ అనారోగ్య కారణాలు చూపుతూ ఇష్టారాజ్యంగా శరీరంపై కత్తిగాట్లుపెడుతున్నారు. ఆరోగ్యంగా ఉన్నా.. అత్యవసరమని చెప్పి శస్త్రచికిత్సలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. సర్జరీ చేసి బిడ్డను ప్రమాదకరంగా బయటకు లాగుతున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో గత మూడేళ్లలో సాధారణ ప్రసవాలు 25 వేలకు మించి జరగలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గర్భిణీని తొలి నుంచి పరిశీలించాలి. ఎప్పటికప్పుడు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో పరీక్షలు చేయాలి. ఆశా కార్యకర్తలు నిత్యం పరిశీలించాలి. జిల్లాలో అదెక్కడా జరిగిన దాఖలాలు లేవు. శని, ఆదివారాలు వస్తే చాలా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు కనిపించడం లేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. హైరిస్క్ కేసులను ముందుగానే గుర్తించి పెద్దాస్పత్రులకు రిఫర్ చేయాలి. కానీ అలా జరగడం లేదు. అందుకే చాలా మంది ప్రభుత్వ ఆస్పత్రుల ముఖమే చూడడం మానేస్తున్నారు.

ఆ బ్యాగులతో అవస్థలే!

(ఐదో పేజీ తరువాయి)

45 రోజులకే మూలకు చేరిన అంశాన్ని జిల్లా సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకుడు రామారావు వద్ద ప్రస్తావించగా జిల్లాలోని అన్ని పాఠశాలలకు పంపిణీ చేసిన బ్యాగ్‌లు నాణ్యతగా ఉన్నాయని, కొందరు విద్యార్థులు వినియోగించడంలో ఏమైనా సమస్య ఉండొచ్చునని అన్నారు. అయినా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

కందిపప్పుఇచ్చేదెప్పుడో?

(ఐదో పేజీ తరువాయి)

వ్యాపారులు మరింతగా ధర పెంచేస్తున్నారన్న విమర్శ ఉంది. నాలుగు నెలల కిందట కిలో కందిపప్పు రూ.80 ధర పలికేదని, ప్రస్తుతం రూ.120 పైబడిందని వినియోగదారులు చెబుతున్నారు. ఆగస్టులో అయినా పంపిణీ చేస్తారని రేషన్ కార్డుదారులు ఆశగా చూశారు కానీ నిరాశే ఎదురైంది.

పైశాచికం

(ఐదో పేజీ తరువాయి)

విజయ్‌కుమార్‌తన దుస్తులు తానే తొలగించుకొని బాలిక ముందు దిగంబరంగా నిల్చొన్నాడు. భయాందోళనకు గురైన చిన్నారి వెంటనే ఇంటికి పరుగుతీసింది. భయంతో వణికిపోవడంతో తల్లి ఆరా తీయగా ఉపాధ్యాయుడు ప్రవర్తించిన తీరును బాలిక వివరించింది. దీంతో తీవ్రఉక్రోశానికి గురైన తల్లిదండ్రులు ట్యూషన్ వద్దకు వెళ్లగా అప్పటికే తలుపులుమూసి ట్యూషన్ మాస్టారు వెళ్లిపోయాడు. ఆదివారం సెలవు అనంతరం ఎప్పటిలాగే సోమవారం సాయంత్రం ట్యూషన్ సెంటర్‌కు వచ్చాడు.అంతలో గ్రామస్థులందరూ అక్కడకు చేరుకొని విజయ్‌కుమార్‌ను నిలదీస్తూ దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. కొంత సేపటికి చేరుకున్న హైవే మొబైల్ పోలీసులు అతన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై సీఐ కె.దుర్గాప్రసాద్‌రావును వివరణ కోరగా కేసు నమోదు చేశామన్నారు.



శిథిలావస్థకు చేరిన కలవచర్ల ప్రాథమిక పాఠశాల భవనం

పర్యవేక్షణ లేక.. భవనం తొలగించక

● భయాందోళన చెందుతున్న గ్రామస్థులు ● ఇదీ కలవచర్ల ప్రాథమిక పాఠశాల భవనం దుస్థితి

గుర్ల,ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవచర్లలో నాలుగుదశాబ్దాల కిందట నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఆ పాఠశాల ఏ క్షణంలో కూలిపోతుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అయితే శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం ఖాళీచేశారు.ఏడాదిగా పక్కనే మరో చోట విద్యార్థులకు బోధించే ఏర్పాట్లుచేశారు. అటుగా విద్యార్థులు వెళ్తే ఎటువంటి ప్రమదాలు చోటుచేసుకుంటాయోనని తల్లిదండ్రులు భీతిల్లుతున్నారు. ప్రధానంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరిన భవనం తొలగింపునకు నోచుకోవడంలేదు. శిథిలావస్థకుచేరిన భవనాన్ని తొలగించాలని ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కాగా శిథిలావస్థకు చేరిన భవనం తొలగించడం విషయం అధికారులు దృష్టి తీసుకెళ్లినట్టు ఎంఈవో భాను ప్రకాష్ తెలిపారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

● సర్వేను బహిష్కరించిన కాకర్లవలస, కారేడువలస గిరిజనులు

రామభద్రపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):దశాబ్దకాలం నుంచి సాగుచేస్తున్న భూములకే పట్టాలివ్వాలని కాకర్లవలస, కారేడువలస గిరిజనులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కాకర్లవలస, కారేడువలస గిరిజన గ్రామాల్లో ఫారెస్టు, రెవెన్యూ అధికారుల సర్వేను గిరిజనులు బహిష్కరించారు. సర్వేచేయడానికి వచ్చిన అధికారులు, పోలీసుల తో గిరిజనులు వాగ్వాదానికి దాగారు. తమ భూములు కాకుండా ఎక్కడో కొండమీద ఉన్న రిజర్వుఫారెస్టు భూములు తమకు కేటాయించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కొండలను అప్పగించి తాము సాగుచేస్తున్న భూములను లాగేసుకోవడంపై గిరిజనులు మండిపడ్డారు. పార్వతీపురం ఫారెస్టుసెక్షన్ ఆఫీసర్ మహేంద్ర, మండల సర్వేయర్ వంగపండు సాయికుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులతో ఆ గ్రామానికి వెళ్లి మాట్లాడడానికి ప్రయత్నించగా వారు నిరాకరించారు. ప్రస్తుతం తాము సాగుచేసుకుంటున్న భూములు తప్ప వేరే విషయంపై చర్చలు లేవని తేల్చిచెప్పారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్‌వోఎఫ్‌ఆర్ భూముల్లోకి తాము వెళ్లబోమని తేల్చిచెప్పారు.దీంతో ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోలీసులు మోహరించి వారికి వచ్చజెప్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది.ఏపీఐఐసీకి కేటాయించిన భూములను గిరిజనులు ఎలా స్వాధీనం చేసుకుంటారని అధికారులు ప్రశ్నించారు.ఈ ప్రాంతంలోఉన్న ప్రభుత్వ భూమి గిరిజనులకే దక్కుతుందని సీఐటీయూ నాయకుడు బలసా శ్రీను స్పష్టంచేశారు. దీంతో రెవెన్యూ, ఫారెస్టు అధికారులు వెనుదిరి గారు. ఈ ఆందోళనలో గిరిజన నాయకులు తౌడమ్మ, లక్ష్మి, లక్ష్మణరావు పాల్గొన్నారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న గిరిజనులు

నేడు ఏఎంసీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

బొబ్బిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి వ్యవసాయమార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన తెర్లాం మండల టీడీపీ సీనియర్‌నేత నర్సుపల్లి వెంకటనాయుడుతో పాటు పాలకవర్గసభ్యులు మంగళవారం పదవీబాధ్యతలు స్వీకరించనున్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మనాయుడు పాల్గొనున్నారు.

దాడితల్లి కల్యాణ మండపానికి భూమి పూజ

బొబ్బిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి పదో వార్డు అంబేడ్కర్ కాలనీలో దాడితల్లి అమ్మవారి ఆలయ పరిధిలో కల్యాణమండపం నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టరు రౌతు రామ్మూర్తి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాస రావు, కార్యక్రమంలో సావు కృష్ణమూర్తినాయుడు, కురిమెల్ల మధుబాబు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' కోసం పేర్లు నమోదు చేసుకోవాలి

రామభద్రపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నదాత సుఖీభవ పథకం రాని లబ్ధిదారులు ఈనెల 15లోగా మళ్లీ వారి పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో అమరా శివ తెలిపారు. సోమవారం రామభద్రపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ మ్యాపింగ్ లేనివారు, ఎన్‌పీసీఐ లింకు లేనివారికి, భూమికి ఆధార్ లింకు లేనివారికి మాత్రమ అన్నదాతా సుఖీభవ రాలేదన్నారు. దీనిపై సంబంధిత అధికారులతో ఈ పనులు చేయించుకొని మళ్లీ ఈ పథకానికి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

రామభద్రపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఆరోపించారు. సోమవారం రామభద్రపురంలోని వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో పశువ్యాధులకు సంబంధించి మందులతోపాటు రసాయన ఎరువుల కొరత తీవ్రంగా ఉందన్నారు. సకాలంలో దొరక్క రైతున్నలు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు

బొబ్బిలి రూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): అనుమతిలేని లేఅవుట్లపై చర్యలు తప్పవని బుడా ఏపీఎం ఎం.వీణ తెలిపారు. సోమవారం బొబ్బిలి మండలపరిషత్ సమావేశభవనంలో బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) ఆధ్వర్యంలో ఎంపీడీవో, సర్పంచ్‌లు, కార్యదర్శులకు లేఅవుట్లకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలు, విధివిధానాలపై అవగాహనకల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ భూముల్లో లేఅవుట్లు వేయాలంటే పంచాయతీతో పాటు వీఎంఆర్‌డీఏ అనుమతులు కచ్చితంగా పొందాలన్నారు. అనుమతులు లేని లేఅవుట్లపై ఫిర్యాదులు అందితే విచారణ జరిపించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్ పాల్గొన్నారు.



బొబ్బిలి: ఐసీడీఎస్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



బాడంగి: సీడీపీవో కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీ సిబ్బంది వినూత్న నిరసన

● సెల్‌ఫోన్లు ఐసీడీఎస్ కార్యాలయాలకు అప్పగింత

బొబ్బిలి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): యాప్‌లను పూర్తిగా రద్దు చేయాలని, కొత్త సెల్‌ఫోన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ముందు సోమవారం అంగన్వాడీ సిబ్బంది వినూత్నంగా నిరసన తెలిపారు. తాము వినియోగిస్తున్న ప్రభుత్వ సెల్‌ఫోన్ల న్నిటినీ ఐసీడీఎస్ పీవో కార్యాలయానికి అప్పగించారు. తొలుత సెల్‌ఫోన్లు చూపుతూ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఆ సెల్‌ఫోన్లను తీసుకునేందుకు ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి సమ్మతించలేదు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వాటిని తీసుకుని భద్రపరచం సాధ్యం కాదని ఆమె చెప్పారు. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది తమ ఫోన్లను మూటలుగా కట్టి కార్యాలయం గదిలో ఉంచి తాళాలువేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు యూనియన్ నాయకులు బి.నిర్మల, జె.కామేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం 2 జీబీ సెల్‌ఫోన్లు ఇచ్చిందని, అవి సక్రమంగా పనిచేయక నానా అవస్థలు పడు తున్నామని అన్నారు. నెట్‌వర్క్ లేక యాప్‌లు పనిచేయక చార్జింగ్ అవ్వక కార్యకలాపాలు నిర్వహించుకోలేక పోతున్నామన్నారు. సమాచారాన్ని సకాలంలో అప్‌లోడ్ చేయలేక అధికారుల మందలింపులకు గురవుతున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు శంకరరావు పాల్గొన్నారు.

5జీ నెట్ వర్క్ ట్యాబ్‌లు ఇవ్వాలి

బాడంగి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అన్ని యాప్‌లు కలిపి ఒకయాప్‌గా మార్చు చేయాలని, ఎఫ్‌ఆర్‌ఎస్, ఇన్, అవుట్ రద్దుచేయాలని, సెంటర్ నిర్వహణకు 5జీ నెట్ కలిగిన ట్యాబ్లుఇవ్వాలని అంగన్‌వాడీయూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు లక్ష్మి డిమాండ్ కోరారు. సోమవారం బాడంగి సీడీపీవో కార్యాలయాన్ని సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ముట్టడించారు. ఈసందర్భంగా లక్ష్మిమాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పోషణట్రాకరు, బాల సంజీవని యాప్ అమలుకు సపోర్టుచేయడం లేదన్నారు. లబ్ధిదారులకు ఫోటోక్యాప్చర్, ఓటీపీ, ఎఫ్‌ఆర్ ఎస్ ద్వారానే సరుకులుఇవ్వాలని పెట్టిన నిబంధన అమలుచేయడానికి అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెట్‌సిగ్నల్ లేకపోవడం, సర్వర్ పనిచేయకపోవ డంతో లబ్ధిదారులంతా ఇబ్బందిపడుతున్నారన్నారు. ఈ ఫోన్ల వల్ల అంగన్‌వాడీలు మానసిక ఒత్తిడికిగురై ఆసుపత్రి పాలవుతున్నారన్నారు.సోమవారం సీడీపీవో కార్యాలయానికి ఫోన్లు తిరిగి ఇచ్చామని,మంగళవారం నుంచి ఆన్‌లైన్‌వర్క్ చేయబోమని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్‌లోని హాజరు, లబ్ధిదారుల హారం పంపిణీ అన్ని రికార్డుల్లో రాస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయ కులు బి.శ్రీను, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాడంగిప్రాజెక్టు సీహెచ్.రవణమ్మ, లక్ష్మి, అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలిలో 'బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ'

బొబ్బిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మునిసిపాలిటీలోని 15వ వార్డులో బాబుష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలోసోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సావు వెంకటమురళీకృష్ణారావు, ఇంటి గోపాలరావు, గొలగాని రమాదేవి, సవలాపురపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిరిడిలో తాగునీటికి అవస్థలు

బొబ్బిలి రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిరిడిలో తాగునీటికి గ్రామస్థులు అవస్థలుపడుతున్నారు. ఇంటింటి కుళాయిలు లేకపోవడంతో వీధి కుళాయిలపై ఆధారపడాల్సివస్తోంది.మూడు రోజులకోకసారి తాగునీరు వీధి కుళాయిల ద్వారా విడుదల చేస్తున్నారని, అది కూడా చిన్న ధార వస్తోందని మహిళలు వాపోతున్నారు. కాగా ప్రతిరోజూ నీరు సరఫరా చేసేలా చర్యలుతీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వతేజ తెలిపారు.



వీధి కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

తల్లిపాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



రామభద్రపురం: గొల్లలపేటలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న సిబ్బంది

రామభద్రపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తల్లిపాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి కోరారు. సోమవారం మండలంలోని గొల్లలపేటలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●బొబ్బిలి రూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ సెక్టర్ సూపర్‌వైజర్ ఎన్.ప్రభావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు తల్లిపాలు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎం గౌరి, ఎంఎస్‌కే రామలక్ష్మి, ఈశ్వరమ్మ, అన్నపూర్ణ, భవాని, తల్లులు పాల్గొన్నారు.

●బొబ్బిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి పట్టణ పరిధిలోని పాతబొబ్బిలి 1, 2 వార్డుల్లో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో తల్లి పాలవారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో సూపర్‌వైజర్లు, టీచర్లు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.

ప్రభుత్వ న్యాయవాదిగా గిరిబాబు

కొత్తవలస, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించి ప్రభుత్వ న్యాయవాదిగా ఎంవీఎస్ గిరిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు వచ్చిన ప్రొసీడింగ్స్‌ను గిరిబాబుకు ఇవ్వడంతో మాజీ ప్రభుత్వ న్యాయవాది కె.మహేశ్వరరావు నుంచి గిరిబాబు బాధ్యతలను స్వీకరించారు.

విద్యార్థులకు టీషర్టుల పంపిణీ

జామి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విజినిగిరి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన తగరంపూడి ప్రసాద్ మాస్టారు దంపతులు మంగళవారం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో టీషర్టులు, చెప్పులు అందించారు. అలాగే గ్రామంలోని నిరుపేదలకు నెల రోజులకు సరిపడా రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొవ్వాడ చంద్రశేఖర్‌కుమార్, మిడతాన తాతంనాయుడు, కిలారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు..

రాజాం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులకు 1985-87బ్యాచ్ విద్యార్థులు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు హెచ్‌ఎం పి.వెంకటరావు చేతులమీదగా సోమవారం వీటిని అందజేశారు. రాజాం ఫ్రెండ్స్ అసోసియేషన్ తరఫున 52 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

గుర్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పాలనలో సాధించిన విజయాలను బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని బూత్ నెంబర్ 206, 207, 208లలో పార్టీ మండల అధ్యక్షుడు పోలిపల్లి కనకరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఆకుల మహేష్, కేవీ నాయుడు, బడిగంటి కాశీవిశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావులు పాల్గొని ప్రజలకు వివరించారు.

కాలువ నిర్మాణానికి భూమి పూజ

శృంగవరపుకోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద రూ.3లక్షలతో నిర్మించనున్న కాలవ నిర్మాణానికి ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైఎస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషికుమారిలు సోమవారం భూమి పూజ చేశారు. ఎంపీటీసీలు సూరి అప్పారావు, నాయకులు మోపాడ శ్రీను, మజ్జి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రాప్ హాలీడే ప్రకటించాలి

పాలకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):శివారు గ్రామాల ఆయకట్టు రైతులకు నీరందించకపోతే క్రాప్‌హాలీడే ప్రకటించాలని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, టీడీపీ రైతుల ప్రతినిధి వారాడ సుమంత్‌నాయుడు కోరారు. సోమవారంపట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ఆం దోళన చేపట్టారు. అనంతరం ఇరిగేషన్ డీఈకు వినతిప త్రం అందిం చారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు బంటు దాసు, రమణా రావు, పాలకొండ, రుద్రిపేట, ఓని, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: ఏడీ

సీతానగరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ బి.శ్రీనివాస రావు తెలిపారు.సోమవారం సీతానగరం పశు వైద్య కేంద్రంలో పశువులకు వైద్య సేవలందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ గర్భోత్పత్తి వ్యాక్సిన్ కేవలం రూ. 150కు ఇస్తామని, అన్ని పశు వైద్య కేంద్రాల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆడ దూడలు జన్మించే విధంగా ఇస్తున్న వ్యాక్సిన్ పాడి పశువులకు వినియోగించాలని కోరారు.